పేదల సంజీవని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ఆరోగ్యశ్రీ నూతన కార్డులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పేదలకు సంజీవని లాంటి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స వ్యయ పరిమితిని రూ. 25 లక్షలకు పెంచుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని 216వ వార్డు సచివాలయంలో మంగళవారం జరిగిన ఆరోగ్యశ్రీ నూతన కార్డుల పంపిణీ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో వైద్య వ్యవస్థ గొప్ప పురోగతిని సాధించడంతోపాటు పేదలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. గత ప్రభుత్వంలో కేవలం కొన్ని రకాల వ్యాధులకు మాత్రమే వైద్యం అందేనని కానీ జగనన్న ప్రభుత్వంలో ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాల కార్పొరేట్ ఆస్పత్రుల్లో దాదాపు 3,257 జబ్బులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. సెంట్రల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 74,585 కుటుంబాలకు ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 160 కోట్ల విలువైన వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. వీటితో పాటు ఫ్యామిలీ డాక్టర్, వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, 104, 108 సేవల విస్తృతి, పీహెచ్‌సీల ఆధునికీకరణ, మెడికల్ కాలేజీల నిర్మాణం తదితర చర్యలతో వైద్య ఆరోగ్య రంగంలో సీఎం జగన్ సరికొత్త విప్లవాన్ని తీసుకొచ్చారని చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 25 లక్షలకు పెంచడం జగనన్నకి ప్రజల ఆరోగ్యం పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే ప్రతిఒక్కరూ ఆరోగ్యశ్రీ యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ ద్వారా ఎన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి, ఎక్కడెక్కడ ఉన్నాయి తదితర సమాచారం సులభంగా తెలుసుకోవచ్చన్నారు. అనంతరం లబ్ధిదారులకు కొత్త ఫీచర్లతో రూపొందించిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, డెప్యూటీ డీఎంహెచ్ఓ ఇందుమతి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ సుమన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి శ్రీనివాస్, ఉప్పు రంగబాబు, శనగవరపు శ్రీనివాస్, కూనపులి ఫణి, సత్యవాణి, కమ్మిలి రత్న, చల్లా సుధాకర్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాబోయే దశాబ్దానికి జగనన్నే సీఎం



27వ డివిజన్‌లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాబోయే మరో దశాబ్దకాలం పాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే రాష్ట్రానికి సీఎంగా ఉండాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నట్లు ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 27వ డివిజన్ 197, 198, 199, 200వ వార్డు సచివాలయాల పరిధి దుర్గాపురంలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లేశ్వరితో కలిసి మంగళవారం ఆయన పాల్గొన్నారు. తొలుత బావాజీపేటలో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో వంద పేజీల మేనిఫెస్టో ఇచ్చిన చంద్రబాబు అందులో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ రంగంలో ఉన్న పేదవారికి ఉపయోగపడేలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. 197వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా అక్షరాలా రూ. 10.96 కోట్లు మేలు చేకూర్చగా.. 198వ సచివాలయ పరిధిలో రూ. 10.49 కోట్లు., 199వ సచివాలయ పరిధిలో రూ. 9.41 కోట్లు., 200వ సచివాలయ పరిధిలో రూ. 10.79 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. గతంలో చంద్రబాబుకు అధికారం ఇస్తే జన్మభూమి కమిటీల పేరుతో దోచుకుతిన్నారని విమర్శించారు. బాబు హయాంలో సింగపూర్, మలేషియా పర్యటనలు తప్ప పేదలకు చేసిందేమి లేదని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో పేదరికం 11.77 శాతం నుంచి 6.06 శాతానికి తగ్గినట్లు చెప్పుకొచ్చారు. సంక్షేమాభివృద్ధిలో జగనన్న ప్రభుత్వానికి మరెవరూ సాటిరారని ఎమ్మెల్యే విష్ణు పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, నాయకులు పి.వంశీ, భోగాది మురళి, కురిటి శివ, ఎల్.కుమార్, రాము, కె.నాగరాజు, కనకారావు, కె.అనిల్, ఎం.రాము, అంజి, సునీల్, పి.శ్రీధర్, వేమన చిన్ని, యర్రంశెట్టి శ్రీను, వీబీ.ఆచారి, పార్టీ శ్రేణులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి సెమీ క్రిస్మస్ వేడుకలకు పటిష్ట బందోబస్తు



బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీపీ రాణా, అధికారులు

విజయవాడస్పోర్ట్స్: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 20వ తేదీ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సెమీ క్రిస్మస్ వేడుకలకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. స్టేడియంలో చురుగ్గా జరుగుతున్న కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం ఆయన పర్యవేక్షించారు. ఈ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో భద్రత ఏర్పాట్లను అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని అత్యంత పగడ్బందీగా చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. సీపీ వెంట అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, డీసీపీ వి.అజిత, ఏసీపీ పి.భాస్కరరావు ఉన్నారు.

ముగిసిన సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు



వివిధ రకాల పూలతో స్వామివారి అలంకారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లోని స్వయంభూ శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్లకు ఆలయ అర్చకుడు రంగావఝ్జల ప్రసాద్‌శర్మ ఆధ్వర్యాన వివిధ రకాల పుష్పాలతో అర్చన నిర్వహించారు. తొలుత లోక కల్యాణార్థం శాంతి హోమం వేదపండితుల మంత్రోచ్ఛారణలతో జరిగింది. అనంతరం మహిళలు వివిధ రకాల పుష్పాలు చేతబూని మేళ తాళాలతో పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం కనులపండువగా జరిగింది. శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల పవళింపు సేవతో షష్ఠి ఉత్సవాలు ముగిశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక పూజలు....

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీబాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో షష్ఠి మహోత్సవాల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి మంగళవారం పాల్గొన్నారు. ప్రతీ ఏటా షష్ఠి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాయకుడా వర్ధిల్లు వెయ్యేళ్లు పోస్టర్ ఆవిష్కరణ



పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం పురస్కరించుకుని 'నాయకుడా వర్ధిల్లు వెయ్యేళ్లు' అనే పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పరిపాలనలో అర్హులైన పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ఎన్నికల మేనిఫెస్టోలో 99 శాతం వాగ్దానాలు పూర్తి చేశారన్నారు. పారదర్శక పాలనతో రాష్ట్ర ప్రజల మన్ననలను అందుకున్న ప్రజా నాయకుడు పుట్టిన రోజు సందర్భంగా విజయవాడ నగరంలో 10వేల పోస్టర్లను పేస్ట్ చేయడం జరుగుతుందని చెప్పారు. సీఎం జన్మదినోత్సవం రోజున నగరంలో కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ, విద్యార్థులకు పుస్తకాలు, మహిళలకు చీరలు పంపిణీ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, పోరంగి మల్లిక, షేక్ షఫీవుల్లా, ఏ.శ్రీను, తోట గోపి, ఆర్.మధు, భరద్వాజ్, దాసం దుర్గారావు, అంబేద్కర్, సిపి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనలో ప్రతి ఇంటా సంక్షేమం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనలో ప్రతీ ఇంటా సంక్షేమం వెల్లివిరుస్తోందని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ 251వ వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డి నగరపాలకసంస్థ అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. 30వ డివిజన్‌లో ఇప్పటి వరకు రూ. 18.21 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని మల్లాది విష్ణు తెలిపారు.

నీటి నిల్వ ప్రాంతాల్లో గంబూసియా చేపలు

ఇటీవల కురిసిన వర్షాలకు నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు అధికారులతో కలిసి గంబూసియా చేపలను వేశారు. ఈ సందర్భంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమల నివారణకు సహకరించాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

టీడీపీ కరపత్రికలుగా ఎల్లో మీడియా

ఎల్లో మీడియా పూర్తిగా టీడీపీ కరపత్రికలుగా మారిపోయాయని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. అడుగడుగునా రాష్ట్ర ప్రభుత్వంపై, సీఎం జగన్‌పై కాలకూట విషాన్ని కక్కుతున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వంలోనే ఎక్కువ శాతం అప్పులు చేశారని అన్నారు. గత నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులు రూ. 1,77,991 కోట్లు మాత్రమేనని సాక్షాత్తూ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లోక్ సభ సాక్షిగా లిఖిత పూర్వక సమాధానం చెప్పినట్లు గుర్తు చేశారు. కనుక రాష్ట్ర ప్రతిష్ఠను మసకబార్చే ప్రయత్నాలు మానుకోవాలని.. 2024లో మళ్లీ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, నాయకులు, సచివాలయ సిబ్బంది, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

విద్య, ఉపాధిలో విప్లవాత్మక సంస్కరణలు



కంకిపాడు: విద్య, ఉపాధి రంగాలను ప్రజలకు చేరువ చేయడానికి ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తోందని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లులో ప్రభుత్వ బాలుర వసతి గృహానికి ఆరు ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్ సెట్లను మంగళవారం వితరణగా అందించారు. అక్కడ వసతి పొందుతున్న కళాశాల విద్యార్థులతో ముచ్చటించారు. విద్యా ప్రమాణాల మెరుగునకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. స్నిగ్ధ మాట్లాడుతూ గత టీడీపీ సర్కారు విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు ప్రగతి లేక, వసతులు కరువై విద్యార్థులు చదవడానికి ఆస్కారం లేక ఇబ్బందులు పడ్డారన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వం కార్పొరేట్‌కు ధీటుగా విద్యా సంస్థలను తీర్చిదిద్దుతోందని తెలిపారు. విద్యలో తీసుకొచ్చిన సంస్కరణలతో అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించేలా బోధన సాగుతోందన్నారు. విద్యార్థులు వసతులు, అవకాశాలను వినియోగించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీ ప్యాట్‌పై అవగాహన



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలతో అధికారులు మంగళవారం వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో పొలిటికల్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల సమయంలో వాడే ఈవీఎం, వీవీ ప్యాట్‌ల పనితీరును వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన ఓటింగ్ ప్రక్రియలో మూడు మెషిన్లు ప్రథమంగా ఉంటాయని, మొదటిది ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం) అని ఇందులో ఎంత మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారో, వారికి ఎన్నికల కమిషన్ కేటాయించిన గుర్తులతో వరుస సంఖ్యలో ఒకటి నుంచి 16 వరకు ఉంటాయని తెలిపారు. రెండో విభాగం వీవీప్యాట్ అని, దీని ద్వారా ప్రజలు వారు ఎవరికి ఓటు వేశారో డిస్‌ప్లేలో చూసుకోవడమే కాకుండా పేపర్ ద్వారా కూడా వారు ఎవరికి ఓటు వేసారో లోపల భద్రంగా ఉంటాయని ఆ పేపర్లు తర్వాత ఆడిట్‌లో లెక్కించడం జరుగుతుందని చెప్పారు. మూడవది కంట్రోల్ యూనిట్ అని ప్రజలు వేసే ప్రతి ఒక్క ఓటు కంట్రోల్ యూనిట్‌లో నమోదు అవ్వడమే కాకుండా ఓటు వేసిన తర్వాత బీప్ శబ్దం వస్తుందని తెలిపారు. అనంతరం ఆయన వివరణాత్మకంగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు డెమో కూడా ఇచ్చారు. నగరంలోని అన్ని ప్రదేశాల్లో ఒక వ్యాన్ ద్వారా ఓటర్లకు అవగాహన కోసం వీఎంసీ ఎన్నికల సెల్ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు వై.సుందర్‌పాల్ (వైఎస్సార్ సీపీ), ఎస్.సాంబశివరావు(టీడీపీ), యస్ ఎ.అన్సారి (కాంగ్రెస్), ఎస్.వీరభద్రరావు(సీపీఐ), వై.సుబ్బారావు(సీపీఎం), వెంకట్ నమ్మిసెట్టి (బీజేపీ), జెడ్‌సి–2 మల్యాద్రి, సెంట్రల్ తహసీల్దార్ వెన్నెల శ్రీను, నార్త్ తహసీల్దార్ ఎం.మాధురి, ఎస్ఈ(ప్రాజెక్ట్స్) కె.రామ్మోహన్‌రావు, డెప్యూటీ తహసీల్దార్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

22న బీసీ రథయాత్రకు తరలిరండి



రథయాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘు నేతలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీలకు శాసన సభలో 90 శాతం, పార్లమెంట్‌లో 13 శాతం స్థానాలను అన్ని రాజకీయ పార్టీలు కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 22వ తేదీన నిర్వహించే బీసీ రథయాత్రకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ ఇన్‌చార్జి వై.నూకాలమ్మ పిలుపునిచ్చారు. చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రథయాత్ర వాల్‌పోస్టర్లు, కరపత్రాలను పలువురు బీసీ సంక్షేమ సంఘం నేతలు ఆవిష్కరించారు. అనంతరం బీసీ నాయకుడు శీరం నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూకాలమ్మ మాట్లాడుతూ.. బీసీల రాజాధికారం కోసం మరో స్వాతంత్ర్య పోరాట రథయాత్ర పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని కోరుతున్నామని, అలా కేటాయించిన వారికే మద్దతు తెలుపుతామన్నారు. జాతీయ పార్టీలు 275 పార్లమెంట్ స్థానాలను, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టి, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విజయవాడ సిటీ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు కనిశెట్టి లక్ష్మణరావు, సంఘం విజయవాడ ఉపాధ్యక్షుడు తమ్మిన దుర్గారావు, బీసీ లీగల్ సెల్ కన్వీనర్, పిల్లా శ్రీనివాసరావు, సుకాశి సరిత, పీసా అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు కృషి చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): పిల్లల్లో ప్రతిభను చూడాలి తప్ప వివక్షకు చోటు ఉండకూడదని అప్పుడు సమానత్వం దానికదే వస్తుందని, రేపటితరం లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు కృషి చేయాలని జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి వై.జాన్సన్ అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళ సాధికార విభాగం ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని కావున అమ్మాయిలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీ శైలజ లింగవివక్షత సమాజం, విద్యపై ఏ విధంగా చెడు ప్రభావం చూపుతుందో వివరించారు. మహిళల కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు జె.శాంతిబాయి, ఎస్ఎల్.జానకి, లలిత అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ కోర్టులో 15 కేసుల విచారణ



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని సర్కిల్ – 2 కార్యాలయంలో జరిగిన మొబైల్ కోర్టులో మంగళవారం మున్సిపల్ జడ్జి బి.విజయ్‌కుమార్‌రెడ్డి 15 కేసులు విచారించారు. రహదారులపై చెత్త వేసిన వారికి, కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి, మురుగు ప్రవాహానికి అడ్డు పెట్టినందుకు సర్కిల్–2 పరిధిలో ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన ఆయా కేసులను విచారించి బాధ్యుల నుంచి రూ.7,890 జరిమానా వసూలు చేశారు. ఒకసారి జరిమానా విధించాక రెండోసారి కూడా ఆ తప్పు చేస్తే కఠినంగా చర్యలు తీసుకొని లైసెన్స్ కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్–2, డాక్టర్ వి.రామకోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్–4 ఎం.మహేష్ బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో మంగళవారం సాయంత్రం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛారణలతో పూజలు జరిగాయి. ధర్మకర్తల మండలి చైర్మన్, ధ్వజస్తంభం దాత కనపర్తి కొండలరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠ మహోత్సవాల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు, చైర్మన్ కనపర్తి కొండలరావును అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగినేని భవాని, ఆలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ జాతీయ పోటీలకు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: సాఫ్ట్ టెన్నిస్ జాతీయ పోటీలకు ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు ఎం.భావన, పి.లావణ్య ఎంపికయ్యారు. గుంటూరులోని బీఆర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి సింగిల్స్ పోటీల్లో భావన సిల్వర్, లావణ్య బ్రాంజ్ మెడల్‌ను సొంతం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన ఎంపిక పోటీల్లోనూ ఇరువురు క్రీడాకారిణులు అద్భుతమైన క్రీడా నైపుణ్యంతో రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 17వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కాలేజీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, ఫిజికల్ డైరెక్టర్ వి.లక్ష్మీకనకదుర్గ క్రీడాకారిణులను అభినందించారు.

డీఆర్‌ఓపీ మొదటి ఫేజ్ విజయవంతం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ గ్రీన్ ఇనిషియేటివ్‌లో భాగంగా ఇండియన్ పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్(ఐపీసీఏ), కియా ఇండియా చేపట్టిన 'ప్రాజెక్ట్ డెవలప్ రెస్పాన్సిబుల్ అవుట్‌లుక్ ఫర్ ప్లాస్టిక్(డీఆర్‌ఓపీ)' మొదటి ఫేజ్ విజయవంతమైందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అడ్వైజర్ డా జె.జయప్రకాశ్‌సాయి అన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని లెమన్ ట్రీ ప్రీమియర్‌లో 'ఎఫెక్టివ్ ప్లాస్టిక్ వేస్ట్ కలెక్షన్–రీసైక్లింగ్' అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి దశ విజయవంతానికి కృషి చేసిన ఐపీసీఏ, కియా ఇండియా సంస్థలకు అభినందనలు తెలియజేశారు. వివిధ శిక్షణా కార్యక్రమాల ద్వారా ప్లాస్టిక్ వినియోగం, రీసైక్లింగ్ వంటి అంశాలపై బాధ్యతాయుతమైన వైఖరిని కలిగించేలా ప్రాజెక్ట్ డీఆర్‌ఓపీ లక్ష్యంగా పెట్టుకుని పని చేసినట్లు ఐపీసీఏ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ఆశిష్ జైన్ తెలిపారు. నగరంలో ముందస్తుగా గుర్తించిన 80 నివాస ప్రాంతాలు, 10 వాణిజ్య సంస్థలు, 10 విద్యా సంస్థలతో సహా 100 సంస్థలతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణకు పనిచేసినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్ట్‌లో నమోదు చేసుకున్న అన్ని సొసైటీలు, పాఠశాలలు వ్యాపారులకు ప్రశంసా పత్రాలు, అవార్డులను అందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.బ్రహ్మాజీరావు, కృష్ణా, గోదావరి కెనాల్ స్వచ్ఛ మిషన్ సీనియర్ కన్సల్టెంట్ స్మితభాను, సస్టైనబులిటీ అండ్ సీఎస్ఆర్ డెప్యూటీ మేనేజర్ సజల్‌జైస్వాల్, కియా ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుతోనే అభ్యున్నతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలో విద్యుత్ పొదుపు కొనసాగినప్పుడే అభ్యున్నతి త్వరగా సాధ్యమవుతుందని నూజివీడు ట్రిపుల్ ఐటీ అకడమిక్ డీన్ డాక్టర్ జ్యోతిలాల్‌నాయక్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో 'ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ ఇట్స్ ఇంపార్టెన్స్ ఫర్ సస్టేనబుల్ డెవలప్‌మెంట్' వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ పొదుపు అవశ్యకత అంశాలపై సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతిలాల్‌నాయక్ మాట్లాడుతూ.. దేశీయంగా ఇంధన వినియోగంలో వ్యవసాయ రంగం 18 శాతం వాటాను కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి, విభాగాధిపతి ఏ శేఖర్‌సునీల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలోత్సవం









నగరంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో 6వ అమరావతి బాలోత్సవం మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ